Namasthe Telangana Dt 04/07/15

# మెట్రోకూ పచ్చల హారం..

## నేడు ప్రారంభించనున్న మంత్రి పద్మారావు

నమస్తే తెలంగాణ, సిటీబ్యూరో: 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమంలో భాగంగా హెచ్ఎంఆర్ ఐదు లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించింది. లక్ష ఏపుగా పెరిగే మొక్కలతో పాటు, మరో 3లక్షల డెకోరేటివ్, పూల మొక్కలను నాటనున్నారు. కార్యక్రమాన్ని మంత్రి టి.పద్మారావు ఉప్పల్ స్టేషన్ వద్ద ప్రారంభించనున్నారు. మెట్రో కారిడార్లు ఆకర్షణీయమైన రూపాన్ని సంతరించుకుంటాయని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. మొక్కలను హైదర్‌నగర్ నర్సరీలో కొద్ది నెలలుగా పెంచామని తెలిపారు.

ఏపుగా పెరిగే చెట్లు: రావి, వేప, కానుగ, పోగడ, స్పతోడియా (ఫిలిఫ్‌ట్రీ), తబూబియా, మెహగనీ

డేకొరేటివ్ చెట్లు: జట్రోఫా, అల్లమందా, ప్లుమేరియా, ల్యాకోఫిలం, బొగేనివిలియా, అమరాంతుస్, టికోమా.

**పోచంపల్లి చీర నమూనాలో..**

ఉప్పల్ స్టేషన్ పరిసరాల్లో పోచంపల్లి చీర నమూనాలో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ ఏర్పాటుచేసే సైడ్‌వాక్‌లు పోచంపల్లి చీర తరహాలో దర్శనమీయనున్నాయి. వీటితోపాటు స్టేషన్ పరిసరాల్లో స్ట్రీట్ ఫర్నిచర్, సర్వీస్‌లేన్లు, హైవే, బస్సుబే, ఆటోబేను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.



Sakshi DT 04/07/15




# ఐదు లక్షల మొక్కలతో హరితహారం: ఎన్వీఎస్‌రెడ్డి

నగరంలోని మూడు మెట్రో కారిడార్లలో ఐదు లక్షల మొక్కలతో హరితహారం ఏర్పాటు చేయనున్నట్లు హెచ్‌ఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెట్రో ప్రాజెక్టులో భాగంగా మెట్రో హరితహారం ప్రాజెక్టును చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా లక్ష పెద్ద మొక్కలు, మరో నాలుగు లక్షల పూల మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. మెట్రో పిల్లర్లు, వయాడక్ట్ సెగ్మెంట్ల కింద వీటిని ఏర్పాటు చేయడంతో మెట్రో కారిడార్లకు కొత్త కళ వస్తుందన్నారు. శనివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు చేతుల మీదుగా ఉప్పల్ మెట్రో స్టేషన్ ఆవరణలో లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. – సాక్షి, సిటీబ్యూరో